ప్రజాశక్తి
సోమవారం 8 జులై 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# ఉచితం అనుచితమే..!



నక్కపల్లిలోని ఇసుక డిపో

- స్థానిక నదుల్లో లేని ఇసుక రీచ్‌లు
- డిపోలపైనే ఆధారం
- ధరతో పాటు తప్పని రవాణా భారం
- నేటి నుంచి ఉచిత ఇసుక

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

జిల్లాలో ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమల్లోకి రానుంది. శారద, వరహా, తాండవ నదుల్లో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో ఇప్పటివలె భవిష్యత్తులోనూ నిర్మాణ అవసరాలకు ఇతర ప్రాంతాలపైనే ఆధారపడాల్సివుంది. ప్రస్తుతం జిల్లాలో నర్సీపట్నం, నక్కపల్లిల్లో డిపోల్లోని ఇసుకకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారులు ధర నిర్ణయించారు. నర్సీపట్నం డిపోలో టన్ను ఇసుక రూ.1060, నక్కపల్లిలో టన్ను ఇసుక రూ.1250 చొప్పున దరఖాస్తు ప్రాధాన్యతా క్రమంలో విక్రయించనున్నారు.

జిల్లాలో ఇసుక రీచ్‌లు లేక ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వంశధార, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి గోదావరి నదుల నుంచి ఇసుక తెప్పించి నర్సీపట్నం, నక్కపల్లి డిపోల ద్వారా విక్రయిస్తున్నారు. ప్రస్తుతమున్న ఇసుక నిల్వలు పూర్తయ్యాక భవిష్యత్తులో ఈ నదుల నుంచి ఇసుక తెప్పించి వాటి దూరం ఆధారంగా ధర నిర్ణయించి ప్రభుత్వం ఇసుక సరఫరా చేయనుంది. ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రస్తుతమున్న రెండు డిపోలు సరిపోకపోతే మరో రెండు, మూడు ఇసుక డిపోలు ఏర్పాటుచేయనున్నారు. నిర్మాణ డిమాండ్‌ను బట్టి అనకాపల్లి, చోడవరం ప్రాంతాల్లో ఇసుక డిపోలు ఏర్పాటుచేసే ఆలోచనలో అధికారులున్నారు. ప్రజల అవసరాలకు తగినట్లు డిపోలు అందుబాటులో పెట్టకపోతే ఇసుక ధరతో పాటు రవాణా ఖర్చు తడిసిమోపెడు కానుంది. రవాణా భారం తగ్గించేందుకు అందుబాటులో ఇసుక డిపోలు ఏర్పాటుచేయాల్సివుంది. జిల్లాలోని నదులు, గెడ్డల్లో భారీ స్థాయిలో ఇసుక తరలింపునకు అవకాశం లేకపోవడంతో స్థానికంగా సొంత ఇంటి నిర్మాణ అవసరాలకు తహశీల్దార్ అనుమతితో ఎండ్ల బండ్లలో ఇసుక తీసుకెళ్లాల్సివుంది. స్థానిక అవసరాల పేరుతో ఇసుక అక్రమ తరలింపు, అమ్మకాలు చేసిన వారిపై చర్యలు మిగతా 2లో..



కొప్పుగొండుపాలెంలో నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బాలిక హత్య కేసులో..

## నిందితున్ని కఠినంగా శిక్షించాలి

### ఐద్వా, ప్రజా సంఘాల డిమాండ్

రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెం గ్రామంలో మైనర్ బాలిక బద్ది దర్శినిని హత్య చేసిన సురేష్‌ను కఠినంగా శిక్షించాలని ఐద్వా, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడు నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ పరామర్శించారు. దర్శిని మృతిపట్ల సంతాపం ప్రకటించారు. నిందితుడు సురేష్‌ను పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ఫోక్సో చట్టం కింద అరెస్టయి, బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితునిపట్ల పోలీసులు అప్రమత్తంగా లేకపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని వారు తెలిపారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

## వైభవంగా జగన్నాథ రథయాత్ర

▸ వార్త 7లో..

## పోలీస్ కమిషనరేట్‌లో రికవరీ మేళా

▸ వార్త 8లో..

## సిటీ స్పెషల్ బ్రాంచి ఎసిపిగా ప్రభాకర్

▸ వార్త 2లో..



వికెట్ తీసిన ఆనందంలో రాయలసీమ కింగ్స్ క్రీడాకారులు

## రాయలసీమ కింగ్స్ గెలుపు

ఉత్తరాంధ్ర లయన్స్‌పై సత్తా చాటిన ప్రశాంత్ కుమార్ వార్త మెయిన్‌లో...

# సరిపడా ఎరువులు, విత్తనాలు

- కౌలు రైతుల బ్యాంకు రుణాలకు నిబంధనల అడ్డంకి
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు

**ప్రజాశక్తి - అనకాపల్లి**

జిల్లా రైతాంగానికి సరిపడా విత్తనాలు, ఎరువులు అందించేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో జిల్లాలో వ్యవసాయ శాఖ తీసుకుంటున్న చర్యలు, విత్తనాలు, ఎరువుల సరఫరా తదితర అంశాలను ఆయన 'ప్రజాశక్తి'కి వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**జిల్లాలో సాధారణ విస్తీర్ణం ఎంత ? పంటల పరిస్థితేంటి ?**

జిల్లాలో సాధారణ విస్తీర్ణం 75 వేలా 223 హెక్టార్లు. ఖరీఫ్ సీజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 53 వేలా 121 హెక్టార్లకుగాను ప్రస్తుతం 240 హెక్టార్లలో నారుమడులు వేశారు. అలాగే గంటి, చోడి వంటి రకాలు 949 హెక్టార్లకుగాను 116 హెక్టార్లు, అపరాలు 665 హెక్టార్లకుగాను 100 హెక్టార్లు, వేరుశనగ, నువ్వులు 843 హెక్టార్లకుగాను 64 హెక్టార్లు, చెరుకు 19 వేలా 471 హెక్టార్లకుగాను 4




వేల హెక్టార్లు, ఇతరాలు 174 హెక్టార్లలో సాగు చేస్తున్నారు.

**విత్తనాలు, ఎరువులు ఎంత మేరకు అందించారు ?**



జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 23 వేలా 432 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా 22 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అందించాం. సీడ్ విలేజ్ ప్రోగ్రాం కింద మిగతా 2లో..

## మొదటి పేజీ తరువాయి..

### ఉచితం అనుచితమే..!

తీసుకొనే వ్యవస్థను ప్రభుత్వం పటిష్టం చేయనుంది.

జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్, ఎస్‌పి, జిల్లా పంచాయతీ, ఇరిగేషన్, మైన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ అధికారులతో జిల్లా స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అనకాపల్లి, చోడవరం, యలమంచిలి, నర్సీపట్నం, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల్లో స్థానిక అవసరాలకు ఇసుక తీసుకెళ్లడానికి వున్న అవకాశాలను పరిశీలిస్తున్నారు.

### సరిపడా ఎరువులు, విత్తనాలు

30 యూనిట్లుకుగాను ఒక్కో యూనిట్‌కు 750 క్వింటాళ్ల చొప్పున 50 శాతం రాయితీపై ఇచ్చాం. జిల్లాలో 413 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా ప్రస్తుతం ఆయా రైతు భరోసా కేంద్రాలు, మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్ల వద్ద 675 మెట్రిక్ టన్నుల డిఎపి, 1110 మెట్రిక్ టన్నుల ఎంఒపి, 10050 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 765 మెట్రిక్ టన్నుల ఎస్‌ఎస్‌పి, 7144 మెట్రిక్ టన్నుల యూరియా మొత్తం 10 వేలా 745 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచాం.

**జిల్లాలో వర్షపాతం ఎలా ఉంది ?**

జిల్లాలో సాధారణ వర్షపాతం విషయానికొస్తే జూన్ 1 నుంచి జులై 5వ తేదీ వరకు అధిక శాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 142.1 మిల్లీమీటర్లు కాగా 221 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 56 మిల్లీమీటర్లు అధిక శాతం నమోదైనా జిల్లా రైతాంగం వరి నారుమళ్లు వేసేందుకు ముందుకు రాలేదు.

**ఈ-క్రాప్ ఎంతవరకు నమోదు చేశారు ?**

జిల్లాలో ఇంతవరకూ లక్షా 71 వేలా 815 మంది రైతులు ఈ-క్రాప్ ద్వారా పంట బీమా చేసుకున్నారు. వారందరికీ క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. ఇదికాక 1318 ప్రయోగాలు నిర్వహించాం. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, ప్రణాళిక విభాగం అధికారులు, వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ ప్రయోగాలు సాగించాం.

**జిల్లాలో కౌలు రైతుల పరిస్థితి ఏంటి ?**

జిల్లాలో కౌలు రైతుల గుర్తింపు కార్డులు పొందిన వారు 4400 మంది ఉన్నారు. వారికి బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిబంధనల కారణంగా వీలుపడలేదు. భూ యజమానులు వీరికిచ్చిన భూములపై ఇప్పటికే రుణాలు పొంది ఉండటమే దీనికి కారణం.

**ఖరీఫ్ సీజన్‌లో రైతులకు మీరు అందించే సూచనలేంటి ?**

వరి నారుమళ్లోకి చిలికిన గెత్తం, పది శాతం కాంప్లెక్స్ ఎరువులు కలిపి వేసుకోవాలి. అలాగే దూరంగా విత్తుకోవాలి. పురుగు పోటు లేకుండా ఉండాలంటే ఒకటిన్నర కేజీ గుళికలు వేసుకుంటే చీడపీడలు రావు. ప్రధాన పంటల్లో పచ్చిరొట్ట ఎరువు, నాలుగు కిలోల పొటాష్, 10 నుంచి 15 కిలోల యూరియా వేసుకొని నాటుకోవాలి. పచ్చిరొట్ట వల్ల భూసారం పెరిగి దుబ్బులు బలిష్ఠంగా వస్తాయి. దీంతో పంట అధికంగా వస్తుంది. పచ్చిరొట్ట ముందుగా వేసుకోవడం వల్ల సేంద్రియ ఎరువుల వినియోగం తగ్గుతుంది. నత్రజని 20 నుంచి 30 కిలోలు పచ్చిరొట్ట ద్వారా వస్తుంది. అలాగే పురుగు మందుల అవసరం ఉండదు. ఈ విషయాన్ని రైతు సోదరులు గమనించి వరి నారుమడి నుంచి తగిన జాగ్రత్తలు తీసుకొని యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరుతున్నాం.

### ఐటి దాఖలు మరింత సులభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐటి దాఖలు మరింత సులభం చేసే క్రమంలో దేశంలోనే మొట్టమొదటి మొబైల్ యాప్ పై ఐటి రిటర్న్సును స్కోరిడోవ్ వ్యవస్థాపకులు సాకార్ యాదవ్ బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులు తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడాన్ని స్కోరిడోవ్ సులభతరం చేసిందని తెలిపారు. myITreturn అనే ఈ సరికొత్త మొబైల్ యాప్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ యాప్‌లో వినియోగదారులు ఎలాంటి భౌతిక పత్రాలనూ అప్‌లోడ్ చేయనవసరం లేకుండా వారి స్మార్ట్ ఫోన్ల నుండి నేరుగా పన్నులను ఫైల్ చేయడానికి వీలు కలుగుతుందన్నారు. మునుపటి కంటే వేగంగా, మరింత సమర్థవంతంగా సేవలు ఉంటాయన్నారు. ఈ యాప్‌ను వినియోగదారున్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించామన్నారు.

### బాదంతో చర్మ రక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాదం పప్పుతో చర్మానికి సంపూర్ణ పోషణ లభిస్తుందని, చర్మం ముడతలను తగ్గించడంలో బాదంపప్పు గణనీయంగా తోడ్పడుతుందని స్కిన్ ఎక్స్‌పర్ట్, కాస్మోటాలజిస్ట్ గీతికా మిట్టల్ గుప్తా తెలిపారు. జులై 8న ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీచ్ రోడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ ఉన్న బాదం చర్మ ఆరోగ్యానికి మేలు చేసే యాంటీ ఏజింగ్ లక్షణాలకు ప్రసిద్ది చెందిందని తెలిపారు. బాదం పప్పులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మానికి కాంతిని తట్టుకునే శక్తి పెరుగుతుందన్నారు.

### క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లారీ డ్రైవర్ నుంచి డబ్బులు వసూలు చేసిన హార్బర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ హెడ్ కానిస్టేబుల్‌ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి విధుల నుండి తొలగించారు. హార్బర్ పోలీస్ స్టేషన్ క్రైం విభాగానికి చెందిన సదరు హెడ్ కానిస్టేబుల్ శనివారం రాత్రి నైట్ రౌండ్ విధులలో తనతో పాటుగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డుతో డబ్బులు వసూలు చేయించిన తీరును ఒక గుర్తు తెలియని వ్యక్తి వీడియో తీశాడు. దాన్ని సిపి ఇచ్చిన 7995095799 నెంబరుకు పంపాడు. ఆ వీడియోను పూర్తిగా పరిశీలించిన సిపి తక్షణం విచారణ జరిపి సదరు హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకున్నారు.

# పోలీస్ కమిషనరేట్‌లో రికవరీ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్‌లో జూన్ నెల రికవరీ మేళాను ఆదివారం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖలో 99 దొంగతనాలు జూన్ నెలలో చోటు చేసుకున్నాయని, ఆ కేసులలో రూ.78,60,266 విలువగల సొత్తును దోచుకుని వెళ్లారని తెలిపారు. వాటిలో జాయింట్ కమిషనర్ ఫకీరప్ప సారథ్యంలో 80 కేసులను ఛేదించామన్నారు. రూ.37,12,715 నగదు, 381.93 గ్రాముల బంగారం, 501.36 గ్రాముల వెండి, ఒక ఆటో, 24 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, 12 మొబైల్ ఫోన్లు, ఒక కెమెరా, 135.9 కేజీల కాపర్ వైర్, 20 కేజీల అల్యూమియం వైర్, తదితరాలను రికవరీ చేశామని తెలిపారు. జూన్ నెలలో 338 సిసి కెమెరాలు నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో వీటిని మరింత విస్తృతంగా ఏర్పాటు చేస్తామన్నారు. చాట్ బాట్ సర్వీస్ ద్వారా నగర పరిధిలో పోగొట్టుకున్న రూ.41.25 లక్షల విలువగల 275 మొబైల్ ఫోన్లను తిరిగి కనుగొన్నామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప , క్రైమ్ డిసిపి వెంకటరత్నం పాల్గొన్నారు.




రికవరీ చేసిన వస్తువులను బాధితులకు అప్పగిస్తున్న పోలీసాధికారులు

### భారత నాస్తిక సమాజం మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 24న వరంగల్‌లో తలపెట్టిన భారత నాస్తిక సమాజం తెలంగాణ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆ సంఘం జాతీయ నాయకులు వై.రవి, టి.శ్రీరామమూర్తి ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గడిచిన 52 సంవత్సరాలుగా భారత నాస్తిక సమాజం అనేక ఉద్యమాలు చేపట్టిందని తెలిపారు. వరంగల్‌లో జరగనున్న సభకు ముఖ్య అతిథిగా తమిళనాడుకు చెందిన ద్రవిడ కజగం నేత అంబురాజు హాజరుకానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వై.నూకరాజు, ఆర్ఎస్‌వి.మురళి, జె.సునీత, రమణి, రాంప్రభు పాల్గొన్నారు.

### రైల్వే డిసిఎం - 2గా పవన్ కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2016 సివిల్ సర్వీసెస్ బ్యాచ్‌కి చెందిన ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ అధికారి కె.పవన్ కుమార్ సీనియర్ డిసిఎం -2గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నైపర్ మొహాలీ నుంచి క్లినికల్ రీసెర్చ్‌లో ఎం.ఫార్మా , పొలిటికల్ సైన్సులో ఎంఎ అభ్యసించారు. గతంలో సౌత్ వెస్ట్రన్ రైల్వే ఫ్రైట్ ఆపరేషన్స్‌లో ఏరియా ఆఫీసర్‌గా పనిచేశారు. 2021, 2022లో మెరుగైన సరుకు రవాణా విషయమై ఎస్‌డబ్ల్యుఆర్‌లో పిసిఒఎం అవార్డును అందుకున్నారు.

### సిటీ స్పెషల్ బ్రాంచి ఎసిపిగా ప్రభాకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సిటీ స్పెషల్ బ్రాంచి ఎసిపిగా నియమితులైన 91 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన కింజరాపు ప్రభాకర్ ఆదివారం సిటీ స్పెషల్ బ్రాంచి ఆఫీసులో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన ఏలూరు డిటిసి నందు డిఎస్‌పిగా బాధ్యతలు నిర్వర్తించారు. విశాఖ నగర పోలీసు శాఖలో పలు కీలక విభాగాలలో విధులు నిర్వర్తించిన అనుభవం ఆయనకు ఉంది.



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర్

### ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐగా పాపారావు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐగా పి.పాపారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రజలందరూ సహకరించాలని, డ్రైవింగ్ చేసేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాపారావు స్పెషల్ బ్రాంచ్ నుంచి ఆనందపురం వచ్చారు. గతంలో పిఎం.పాలెం, ఆరిలోవ, దిశ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు.

### పైడిమాంబ ఆలయ నిర్మాణ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -గాజువాక : నడుపూరు గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ కమిటీ ఆదివారం ఎన్నికైంది. ఛైర్మన్‌గా మంత్రి శంకర్ నారాయణ, ములంపాక అచ్చిలనాయుడు, ట్రెజరర్‌గా బత్తిన నాగభూషణం, కమిటీ సభ్యులుగా తాటికొండ సుదర్శనరావు, సియ్యాద్రి అప్పలరాజు, నరవ శ్రీను ఎన్నికయ్యారు.

# దళారీ వ్యవస్థతో రైతులు దగా

## పంటలకు అందని గిట్టుబాటు ధర

ప్రజాశక్తి -ఆనందపురం : ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక దళారుల వ్యవస్థలో రైతులు దగా పడుతూనే ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం రైతులకు కష్టంగా మారుతోంది. దుక్కి దున్ని పొలంలో పంట పెడదామని వచ్చిన రైతును మొదట ఎరువుల దుకాణదారులు మోసం చేస్తున్నారు. జిల్లాలో ఎక్కడ దొరకనటువంటి పురుగు మందులు రైతుకు మాయమాటలు చెప్పి అంటగట్టేస్తున్నాడు. తర్వాత ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ ఏదోలా పంటను కాపాడుకొని చివరి దశకు వచ్చే సమయానికి దళారీలు ప్రత్యక్షమవుతారు. మండలంలో విస్తారంగా పండించే అరటి, బొప్పాయి, కాయగూరలు, పువ్వులు తదితర అనేక పంటలపై దళారీలు పెత్తనం సాగుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు వచ్చే ఆదాయం కన్నా పెట్టుబడే ఎక్కువ అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్న తమ జీవితాలు ఛిద్రమై పోతాయని, రానున్న రోజుల్లో వ్యవసాయమే కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు. వ్యవసాయ అధికారులు రైతుల దగ్గరకు వెళ్లి పొలంలోని మట్టి నమూనాలు తీసుకొని ఏ పంట అనుకూలమో, ఏ ఎరువులు వాడాలో చెప్పే పరిస్థితి లేదు. గతంలో మండల స్థాయి, ఇప్పుడు పంచాయతీ స్థాయిలో కూడా అధికారులు ఉన్నా రైతులకు ప్రయోజనం కనబడటంలేదు. మండలంలో పంట పండించే రైతులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని, వ్యవసాయం కనుమరుగు కాకముందే చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుకుంటున్నారు.

### నట్టేట ముంచుతున్నారు

వ్యవసాయాన్ని నమ్ముకొని పూలు, కాయగూరలు, కరివేపాకు తోటలను వేసుకొని జీవనం సాగిస్తున్నాం. 500 గ్రాములు ఉన్న కరివేపాకు కట్టను రూ.20 రూపాయలకే కొనుగోలు చేస్తారు. బయట మార్కెట్‌లో మాత్రం రూ.60కి విక్రయిస్తున్నారు. దళారి వ్యవస్థను అరికట్టి ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలి.

**శనగం అప్పన్న**
**కరివేపాకు, పూలు రైతు**
**ఆనందపురం గ్రామం**

### నష్టాల్లో కూరుకుపోతున్నాం

కష్టపడి పండించిన పంటకు లాభాలు వస్తాయని ఆశిస్తే, దళారీ వ్యవస్థ వల్ల నష్టాల్లోనే కూరుకు పోతున్నాం. ఈ ఏడాది మూడం వల్ల పూలకు గిట్టుబాటు ధర లేక కుదేలైపోయాం. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన దళారులు రైతును నట్టేట ముంచుతున్నారు. దళారీ వ్యవస్థను అధికారులు నిర్మూలించాలి.

**రౌతు అప్పారావు,**
**పూల తోటలు , కాయగూరలు రైతు,**
**బంటుపల్లి వారి కల్లాలు**

### శ్రమకు తగ్గ ఫలితం లేదు

గత 20 సంవత్సరాలుగా బొప్పాయి, అరటి, కనకాంబరాలు పూలు సాగుచేస్తున్నాను. పంట చేతికి రాకమునుపు బొప్పాయి టన్ను రూ.15వేలు ఉంటే, పంట చేతికొచ్చేసరికి టన్ను రూ.8 వేలు నుంచి రూ.9 వేలు మాత్రమే రైతుకు ఇస్తున్నారు. దళారీల వల్ల గిట్టుబాటు ధర రావడం లేదు. మూడెకరాలు కౌలుకు తీసుకొని కష్టపడినా లాభం లేకుండా పోతోంది.

**ఇల్లిపిల్లి రమణ,బొప్పాయి రైతు,**
**దుక్కువానిపాలెం**


## నేరాలు ఘోరాలు

### గంజాయితో విద్యార్థుల అరెస్టు

ప్రజాశక్తి -గొలుగొండ: ఎర్రన్నపాలెం చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా 2కేజీల గంజాయితో గుంటూరుకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టగా గుంటూరు జిల్లా రేపల్లె గ్రామానికి చెందిన అల్లపర్తి కౌశిక్(21), నంబూరి అభిలాష్(24)లు రెండు కేజీల గంజాయితో పట్టు బడ్డారన్నారు. పట్టుబడిన ఇద్దరు డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులని ఆయన తెలిపారు. వారి వద్ద నుండి గంజాయితో పాటుగా 1 మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించమన్నారు.

### నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి గొలుగొండ: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని శనివారం రాత్రి అరెస్ట్ చేసామని గొలుగొండ ఎస్సై కృష్ణారావు తెలిపారు. 2021 గంజాయి కేసులో పరారీలో ఉన్న చింతపల్లి మండలానికి చెందిన వంతల ప్రసాదును శనివారం పట్టుకున్నామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని ఆయన తెలిపారు. గంజాయి రవాణా, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాల నిర్వహణ చేపడితే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని ప్రజలంతా తమకు సహకరించాలని ఆయన కోరారు.



### వెలిగిన వీధి లైట్లు

**- ప్రజాశక్తి వార్తకు స్పందన**

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సత్యానగర్‌లో వీధి దీపాలకు మరమ్మతులు చేశారు. 'వెలగని వీధిలైట్లు' శీర్షికన ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి స్థానిక కార్పొరేటర్, అధికారులు స్పందించారు. వీధిలైటును ఆదివారం ఏర్పాటుచేశారు. దీంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తంచేశారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజాశక్తికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజాశక్తి ప్రజల తరుపున నిలబడుతుందని కాలనీవాసులు చర్చించుకున్నారు.

### సన్మార్గంలో నడవండి

ప్రజాశక్తి -మధురవాడ : పిల్లలను సన్మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంటుందని పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ అన్నారు. పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీ సంఘాలు, పిల్లల తల్లిదండ్రులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై సిఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవానగర్ కాలనీలోని పిల్లలు గంజాయి, డ్రగ్స్ సరదాగా అలవాటు చేసుకొని వాటికి బానిసలవుతున్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించి రోజూ వారి నడవడికను గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేర విభాగపు సిఐ రాంబాబు, ఎస్ఐ సునీత, టిడిపి నాయకులు లొడగల జానకిరామ, సేవానగర్ కాలనీ అధ్యక్షులు ఉమామహేష్, అనిల్‌కుమార్, వరుణ్ కుమార్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కార్పొరేటర్ కాకి గోవింద్‌రెడ్డిపై మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 69వ వార్డు టిడిపి కార్పొరేటర్ కాకి గోవింద్‌రెడ్డిపై రెడ్డితుంగ్లాం గ్రామానికి చెందిన కొల్లి సత్యవతి గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలావున్నాయి... అప్పులు ఎక్కువగా ఉండటంతో వాటిని తీర్చేందుకు రెడ్డి తుంగ్లాంలో ఉన్న తన ఆస్తిని కాకి గోవిందరెడ్డికి రూ.1.45 కోట్లకు విక్రయించాలనని తెలిపారు. తాను అప్పులు చేసిన వారందరికీ ఆ డబ్బులు ఇస్తానని చెపితే రిజిస్ట్రేషన్ చేశానని వివరించారు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కాకి గోవిందరెడ్డి అప్పులు తీర్చకుండా తన ఇంటికి పంపిస్తున్నారని తెలిపారు. డబ్బులు అడిగినందుకు తన మెడపై కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**కొల్లి సత్యవతి ఆస్తికి తనకు ఎలాంటి సంబంధం లేదు : గోవిందరెడ్డి**

కొల్లి సత్యవతికి సంబంధించి గాజువాక పోలీస్ స్టేషన్‌కు చేసిన ఫిర్యాదు వాట్సాప్ ద్వారా వైరల్ అవ్వడంతో ఆదివారం సాయంత్రం కాకి గోవిందరెడ్డి తన ఇంటి వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొల్లి సత్యవతి ఆస్తి తాను కొనుగోలు చేయలేదని, ఆ ఆస్తిని, తన అక్క కొనుగోలు చేసిందని తెలిపారు. ఆమె చీటీలు దివాలా తీయడంతో స్థానిక ప్రజలు తనను ఆశ్రయించారని, చీటీలు డబ్బులు ఇవ్వాలని చెప్పాను తప్ప, ఆమె ఆస్తి తాను కొనుగోలు చేయలేదని తెలిపారు. ఆ ఆస్తికి సంబంధించిన డబ్బులు తన అక్క చెల్లించిందని, మిగిలిన బ్యాలెన్స్ చెక్కును కూడా అందజేసినట్లు చెప్పారు. కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

### బిఆర్‌టిఎస్ రోడ్డు బాధితుల సమావేశం

ప్రజాశక్తి- సింహాచలం: బిఆర్‌టిఎస్ రోడ్డు బాధితుల సమావేశం ఆదివారం ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి బాధితులు పెద్ద ఎత్తున హాజరై తమ బాధలు చెప్పుకున్నారు. మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో పలు తీర్మానాలు చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి వైసిపి ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని వివరించాలని తీర్మానం చేశారు. ప్రధానమైన సమస్యలు ఆగస్టు 1వ తేదీకి రివైజ్డ్ కాబోతున్న టిడిఆర్లు విలువలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే బాధితులు 273 మందికి ఒకే విలువైన టిడిఆర్ నాలుగు ఇప్పించాలని, రోడ్డు మ్యాప్ డిపిఆర్‌ను పక్కన పెట్టేసి 30 మంది పేదల ఇళ్లను సుమారు ఏడు నుంచి పది అడుగుల వరకు కూల్చేసిన వారికి ఎడిషనల్ టిడిఆర్‌లు, ఎడిషనల్ స్ట్రక్చర్ కాంపన్‌సేషన్ ఇవ్వాలని, రోడ్డు మధ్య డివైడర్ పెట్టి రెండు రోడ్లు వేయాలని, 50 శాతం దాటి ఇల్లు కోల్పోయిన వారికి లే-అవుట్ వేసి 105 గజాల స్థలం ఇవ్వాలని ఈ సభలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిరిపురం మహేష్, పాలవలస రాంబాబు, పంచదార్ల గోవింద్, లండ రాంబాబు, దాసరి సత్యారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -యంత్రాంగం

**తగరపువలస** : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్య వైశ్య సేవా సంఘం ఆధ్వర్యాన మెయిన్ రోడ్డులోని శ్రీనివాస హెల్త్ కేర్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి డాక్టర్ సిహెచ్ నవీన్‌గుప్తా, డాక్టర్ పి.ప్రవీణ, డాక్టర్ ప్రశాంత్ వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. రూ.1500 విలువైన న్యూరోపతి స్క్రీనింగ్, రూ.500 లు విలువైన హెచ్‌బిఎ1సి పరీక్షలు చేశారు. వైద్యులు పలు ఆరోగ్య సూచనలు చేశారు.




రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ నవీన్‌గుప్తా

**లొడగలవానిపాలెంలో 500 మందికి వైద్య పరీక్షలు**

**ఆనందపురం:** ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో ఉమానారాయణ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 500 మందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వర్ధమాన సినిదర్శకుడు బొమ్మిడి శ్రీతారక్ తన తల్లిదండ్రులైన మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ, మాజీ జడ్‌పిటిసి బమ్మిడి ఉమాదేవి పేరు మీద ఫౌండేషన్‌ను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు శ్రీతారక్ తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. బృంద హాస్పిటల్ డాక్టర్లు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో పెట్రోలియం యూనివర్సిటీ మాజీ ఛైర్మన్ డాక్టర్ వివిఎస్ఆర్‌కె.ప్రసాద్, ఆనందపురం సిఐ తిరుపతిరావు, నాయకులు కోరాడ రాజాబాబు, చిక్కాల విజయబాబు, మాజీ వైస్ ఎంపిపి మీసాల సత్యనారాయణ, కాకర వెంకటరమణ, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఎంపిటిసి సభ్యులు పడాల అప్పలనాయుడు, జైజవాన్ ఫౌండేషన్ సభ్యులు కుప్ప రామలక్ష్మి పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

### మొక్కల నాటివేత

ప్రజాశక్తి -పద్మనాభం : ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పద్మనాభ పంచాయతీ ఇసుకపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రుల సహాయంతో మొక్కలు నాటారు. బిజెపి యువ మోర్చ అధ్యక్షుడు హంస మహేష్ మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కాళ్ల అప్పలరాజు, మాజీ వైస్ సర్పంచ్ కాళ్ల శివ, లింగుబోతు అప్పలరమణ, బుగత పెద్దరమణ, హంస అప్పలనాయుడు, కాళ్ల కొండ, ఎన్నింటి ఆదేష్, కనకల సన్యాసినాయుడు, హంస సింహాద్రి పాల్గొన్నారు.

### ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక దళిత సంఘం నాయకులు కీర్తిశేషులు జి.చిరంజీవి జ్ఞాపకార్థం జివిఎంసి ఒకటో వార్డు సంతపేటలో నెల రోజుల పాటు జరిగిన అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. టోర్నమెంట్‌లో విన్నర్స్‌గా నిలిచిన భీమిలి మండలం మూలకుద్దు జట్టుకు రూ.20 వేలు బహుమతి, జ్ఞాపిక, రన్నర్స్‌గా నిలిచిన కొండపేట జట్టుకు రూ.10 వేలు బహుమతి, జ్ఞాపికను ముఖ్య అతిథి భీమసేన రాష్ట్ర అధ్యక్షులు రవి సిద్ధార్థ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు దండి వెంకటేష్, శివ, ఈశ్వర్, స్వామి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కక్ష సాధింపును ఎదుర్కోవాలి


ప్రజాశక్తి-మధురవాడ : వైసిపి కార్యకర్తలపై ద్వేషపూరితంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, పార్టీ తోడుగా ఉంటుందని నాయకులకు రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి ధైర్యం చెప్పారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, తిప్పల నాగిరెడ్డి, బొడ్డెడ ప్రసాద్, భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 1242వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో ఇంటక్ యూనియన్‌కు చెందిన విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్మికులు కూర్చున్నారు. దీక్షనుద్దేశించి సంఘం ప్రధాన కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను వెంటనే సెయిల్‌లో విలీనం చేసి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సాధించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లో ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకుంటామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పీవీ నగేష్, వంశీకృష్ణ, సుబ్బయ్య, జి.నాగిరెడ్డి, బైరెడ్డి, కె.రమణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



బిఎన్ఆర్ ఫౌండేషన్‌కు విరాళం అందజేస్తున్న శంకరరావు

## బిఎన్ఆర్ ఫౌండేషన్‌కు రూ.30 వేలు విరాళం

ప్రజాశక్తి -మాధవధార : నేవల్ డాక్‌యార్డులో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎం.శంకరరావు ఆదివారం బిఎన్ఆర్ ఫౌండేషన్‌కు రూ.30 వేలు విరాళాన్ని అందించారు. రెడ్డి వెంకటరావు, చిన్నారావు సమక్షంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఎస్.అప్పలరాజుకు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎం.శంకరరావు మాట్లాడుతూ, కంచరపాలెం ప్రాంతంలో విద్య, ఆరోగ్య, సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహణకు తన వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.శంకరరావుకు వారి కుటుంబ సభ్యులకు బిఎన్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యలపై ప్రజలతో భేటీ

ప్రజాశక్తి -ములగాడ : పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పిజివిఆర్ నాయుడు (గణబాబు) ఆదేశాల మేరకు 62వ వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి మాలినాయుడు వార్డులోని సమస్యలపై ఆదివారం స్థానిక పెద్దలతో చర్చించారు. దుర్గానగర్ గ్రామ పెద్దలు, యూత్ సభ్యులతో సమావేశం ఏర్పాటుచేసి గ్రామంలోని సమస్యల గురించి ఆరాతీశారు. కొండవాలు ప్రాంతంలో ఉన్న వాటర్ ట్యాంక్, పరిసర ప్రాంతాల్లో గల వీధి దీపాలు, రోడ్లు సమస్యలను గ్రామ సభ్యులు వివరించారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని మాలినాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు తాని సూరిబాబు, అప్పలరెడ్డి, రామిరెడ్డి, శ్రీను, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## విద్య ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి

ప్రజాశక్తి -ములగాడ : విద్య ఆత్మవిశ్వాసాన్ని పెంచేదిగా ఉండాలని, విద్యలో మానవతా విలువలు, సామాజిక స్థితిగతులను, దేశభక్తి గురించి తప్పక తెలియచేయాలని రామకృష్ణ మిషన్ స్వామిజీ స్వశంవేద్యానందాజీ సూచించారు. విశాఖపట్నంలోని రామకృష్ణ మిషన్‌లో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులకు, ఎన్‌సిసి అధికారులకు,యువజన అభివృద్ధిపై నిర్వహించిన ఒకరోజు సదస్సులో ఆయన మాట్లాడారు. స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. వ్యక్తిత్వ వికాసం, మానవతా విలువలు, శీల నిర్మాణం, విద్యపై స్వామి వివేకానంద భావాలను ఆయన తెలియజేశారు. సదస్సులో జాతీయ సేవాపథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవిని జాతీయ సేవ పథకం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ ప్రశంసా పత్రాలతో సత్కరించారు. సదస్సులో పాల్గొన్న సీనియర్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఉమామహేశ్వరావును, డాక్టర్ ప్రభాకర్ ను, డాక్టర్ అర్జునను, డాక్టర్ సిహెచ్ శ్రీనివాసును ప్రత్యేకంగా అభినందించారు.

## కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి చినముసిడివాడ కల్వర్టుకు ఆదివారం కార్పొరేటర్ సేనాపతి వసంత, నాయకులు శంకరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ, ఎన్నికల ముందు కొన్ని రూ.కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, కొన్ని పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వసంత

## డాక్‌యార్డు సమస్యలపై ఎమ్మెల్యే గణబాబుకు వినతి



ఎమ్మెల్యే గణబాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎన్‌సిఇ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి -ములగాడ : నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబుకు ఆదివారం వినతిపత్రం అందించారు. దీర్ఘకాలంగా ఉన్న ఓవర్ టైం 114 నుండి 150 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఐడి యాక్ట్ నుంచి మినహాయించాలని, షీలానగర్, ఎన్‌బిసి వద్ద టోల్‌గేట్‌లను శాశ్వతంగా తొలగించుటకు చర్యలు చేపట్టాలని, గొడౌన్స్ సమీపంలోని రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ గ్రౌండ్ లేదా ఫ్లైఓవర్ నిర్మించాలని, అప్పటి వరకు పోర్టు అధికారులతో మాట్లాడి ట్రైన్ టైమింగ్ మార్చాలని, సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జ్ మరమ్మత్తు పనులు చేపడితే ఎన్‌బిసి బ్రిడ్జిపై నుంచి ప్రయాణ సౌకర్యం కలిగించాలని కోరారు. బొంబాయి రక్షణ రంగంలో ఓటి అన్ని అలవెన్సులపై ఇస్తున్నారని, కోర్టు కేసులు గెలుచుకున్న విశాఖ రక్షణ రంగంలో ఇవ్వడం లేదని వివరించారు. ఈ వివక్షను తొలగించేందుకు సహకరించాలని కోరారు. దీనిపై గణబాబు స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుబ్బల అరుణ్‌కుమార్, అధ్యక్షులు కొట్టే శ్రీను, అదనపు ప్రధాన కార్యదర్శి భాను, ఉపాధ్యక్షులు డి.మోహనరావు, నాగార్జున, పిఎంఎల్.నాయుడు, వరప్రసాద్, పరమేష్, రమేష్, గణేష్, విజయ్, సత్యనారాయణ, టిఎన్‌టియుసి ఇఎన్‌సి అధ్యక్షులు జగదీష్ పాల్గొన్నారు.

## మాధవధార జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి- మాధవధార : మాధవధార జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవాన్ని ఆదివారం మురళీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా రామోజీరావు మృతికి అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపి మౌనం పాటించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులతో కలిసి కేక్ కటింగ్ చేసి అసోసియేషన్ వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, వివిధ పత్రికలలో పాత్రికేయులుగా పనిచేస్తున్న 16మంది స్థానిక సభ్యులతో అసోసియేషన్ ఏర్పాటైనట్లు తెలిపారు. అసోసియేషన్ ఏర్పాటుచేసిన తరువాత జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి, కొంతమంది సభ్యులకు ఆర్థికంగా అండగా నిలిచినట్లు చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం పలువురు రాజకీయ నాయకులను, అధికారులను కలిసినట్లు తెలిపారు. భవిష్యత్తులో మాధవధార జర్నలిస్ట్ అసోసియేషన్ తరుపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం జర్నలిస్టు కుటుంబం సభ్యులకు విందు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులకు చిరు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీ సిఎం రమేష్‌ను కలిసిన బల్లా

ప్రజాశక్తి-పెందుర్తి : ఎంపీ సిఎం.రమేష్‌ను 94వ వార్డు కార్పొరేటర్ బల్లా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం ఇచ్చి సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తన వార్డులోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మామిడి కిరణ్, సత్యానంద తదితరులు పాల్గొన్నారు.

## సరికొత్త ఫీచర్లతో ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగదారుని 16 అంకెల సర్వీసు నెంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌లో 'బిల్ పే' ఆప్షన్ ద్వారా ద్వారా విద్యుత్ బిల్లులను ఎటువంటి అదనపు రుసుం లేకుండా అత్యంత సులభతరంగా చెల్లించవచ్చని తెలిపారు. అంతేకాకుండా వినియోగదారుని సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. 'మై యుసేజ్' ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్‌లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించు కోవచ్చని వివరించారు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పాత విధానంలోనే నేరుగా ఫోన్‌పే, పేటీఎం, జీపే ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామని పృథ్వీతేజ్ తెలిపారు. సంస్థ వెబ్‌సైటు www.apeasternpower.com నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌లో గాని లేదా సంస్థ వెబ్‌సైటులో గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్ పే, జీ పే, పే టిఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని సిఎండి తెలిపారు.

## కృత్రిమ అవయవాల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజస్థాన్ ఉదయపూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యాన పోర్టు స్టేడియంలో ఆదివారం వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు ప్రశాంత్ అగర్వాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు హాజరై ప్రసంగించారు. విశాఖపట్నంలో సుమారు 350 మందికి శిబిరం ద్వారా ఉచిత కృత్రిమ అవయవాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ మాట్లాడుతూ, రాజస్థాన్‌లో 1100 పడకల ఆసుపత్రిని నిర్వహిస్తున్నామని, జర్మనీ టెక్నాలజీతో కృత్రిమ చేతులు, కాళ్ళు తయారుచేసేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రతిరోజూ 80 నుంచి 100 ఆపరేషన్లు చేయడంతో పాటు అనేకమంది వికలాంగులకు ఉచితంగా వసతి, భోజనం, ఆర్థిక వనరులు సమకూరుస్తూ 39 సంవత్సరాలుగా సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పివిఎన్ మాధవ్, మేడపాటి రవీందర్ రెడ్డి, బొడ్డేటి కాశీ విశ్వనాథం, కార్పొరేటర్ కందుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ బ్రాహ్మిన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం విశాఖపట్నంలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఉన్నత హోదాల్లో ఉన్న బ్రాహ్మణ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా యువ రాజకీయవేత్త ద్రోణంరాజు శ్రీవాత్సవ్ హాజరై మాట్లాడారు. సమాజంలో బ్రాహ్మణులు నేడు దుర్భర స్థితిలో ఉన్నారని, వారిలో మనో ధైర్యం నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా, వ్యాపార రంగాల్లో బ్రాహ్మణుల ఎదుగుదలకు అవరోధం కల్గించే శక్తులు ఎన్నో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయి కార్యాచరణకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రముఖ న్యాయవాది, కెవి.నరసింహామూర్తి మాట్లాడుతూ, బ్రాహ్మణ ప్రతినిధుల సమన్వయం కోసం త్వరలో ఒక కార్యాలయం ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఏపీ బ్రాహ్మణ ఐక్య వేదిక కన్వీనర్ శాయిరామ్ సివిఎస్ (డిఎన్ఎస్) మాట్లాడుతూ, త్వరలోనే బ్రాహ్మణ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి, తద్వారా బ్రాహ్మణులు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపే విధంగా అందరితోనూ సమన్వయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు దివాకర్, హనుమంతరావు, మహంతి, కెజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఎయు విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ రవి, న్యాయవాదులు శ్రీచరణ్, సుబ్రహ్మణ్యం, శంకర్ నీలు, రామభద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వేపగుంట : ఆల్ ఇండియా మెగాస్టార్ చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మహిళలకు జూడో, బాక్సింగ్, తైక్వాండో, ఆడపిల్లలకు ఆత్మ రక్షణకు ఉచిత శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే గణబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ డాక్టర్ పాండ్రంగి రుక్మాకరరావు, రోటరీ గవర్నర్ పోలారావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్ ఇళ్లకు బిల్లులు అందేనా..?

- ఐదేళ్లుగా లబ్ధిదారులు ఎదురుచూపులు!
- కొత్త ప్రభుత్వంపైనే కొండంత ఆశలు
- వైసిపి నిర్వాకంతో అప్పుల పాలై అవస్థలు



బిల్లులు అందక ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:** ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో 2018 -19లో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు వైసిపి సర్కార్ ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో మండలంలో గల పలు గ్రామాల్లో వందలాదిమంది లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో రావడంతో బిల్లులు నేడైనా చెల్లిస్తారేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. 2018-19లో పలు గ్రామాల్లో 500 వరకు ఇల్లును అప్పటి టిడిపి ప్రభుత్వం మంజూరు చేసింది. 400 మంది వరకు లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకున్నారు. హౌసింగ్ శాఖ అధికారులు ఇల్లు వివరాలను యం బుక్‌లను నమోదు చేసి బిల్లులకు సిఫారసు చేశారు. అయితే గత తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కొక్క ఇంటికి రూ.ఒక లక్ష 50 వేల చొప్పున చెల్లిస్తామని తెలియ జేయడంతో చాలామంది లబ్ధిదారులు అప్పులు చేసి ఇల్లు నిర్మాణాలను శ్లాబుల వరకు వేసుకున్నారు. అలాగే కొంతమందికి అరకొరగా చెల్లింపులు చేశారు. మిగతా వారికి ప్రభుత్వం నుండి ముందుగా లబ్ధిదారుల ఖాతాలను సరిచూసుకోవడానికి ఒక్కో రూపాయిని జమచేశారు. వాటిని నిర్ధారించుకున్నాక ఇళ్ల నిర్మాణాల ప్రాప్తికి మిగతా బిల్లులు చెల్లింపునకు అధికారులు అంచనా ప్రతిపాదనలు వేసి సిఫార్సు చేయగా, 2018 మార్చి నెలలో ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లను పరిశీలించారు. కానీ ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నమ్మి అప్పులు చేసి ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారులు, వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఐదేళ్లగా చేసిన అప్పులు కడుతూ లబ్ధిదారులు వస్తున్నారు. ఇపుడు మళ్లీ ప్రభుత్వం మారడ, చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వచ్చిన వెంటనే పాత బిల్లు బకాయిలన్నీ చెల్లిస్తామని నేతలు భరోసానివ్వడంతో ఇళ్ల లబ్ధిదారుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. నూతన ప్రభుత్వమైన బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నాం



ఐదేళ్లగా ఇళ్ల బిల్లులు కోసం ఎదురు చూస్తున్నాను.కానీ ఎవరూ పట్టించుకోలేదు. అప్పులు చేసి, ఇంటి శ్లాబ్ పూర్తి చేశాను. అప్పటి అధికారులు బిల్లులు చెల్లిస్తామన్నారు. నేటికీ బిల్లులు అందలేదు. కొత్త ప్రభుత్వంలో అధికారులైనా మా కష్టాలను పట్టించుకోవాలి, ఇళ్ల బిల్లులు చెల్లించాలి.

మడగల అవతారం, లబ్ధిదారుడు, దిబ్బిడి

## జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు
# చోడవరం విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులతో ఎమ్మెల్యే రాజు

**ప్రజాశక్తి -చోడవరం :** రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో సత్తా చాటి, జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా చోడవరానికి చెందిన విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజు అభినందించారు. గతనెల 30, ఈనెల 1 తేదీల్లో విశాఖ ఎన్‌కెఎన్ఎస్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఏడవ రాష్ట్రస్థాయి కాడెట్ క్యోరుగి, 7వ కాడెట్ క్యోరుగి,7వ కాడెట్ పూమ్‌సే తైక్వాండో పోటీలో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ఎనిమిది బంగారు, నాలుగు రజత, ఐదు కాంస్య పతకాలతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను విశాఖ కైవసం చేసుకోగా, వారిలో చోడవరానికి చెందిన ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలను, ఒకరు రజతం, ఇద్దరు కాంస్య పతకాలను సాధించారు. పూమ్ సే డివిజన్ లో గుడ్డెటిసని వర్ధన్‌కుమార్, గండి కారుణ్య సందీప్ , పడాల తరుణ్ బంగారు పతకాలు సాధించారు. బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పోటీలో అర్హత సాధించిన యమ్ హేమ శ్రీ, వి జెస్సిక రోజీలీ, ఇషిత శారద, జాన్, శశి వర్ధన్, లయ వర్ధనిలను, జిల్లా, రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలో గెలిపొందిన రిషితాంజలి, సుజిత, విజయలను అభినందించారు.

**1న పోర్టు స్టేడియంలో జాతీయస్థాయి పోటీలు**

వచ్చేనెల ఒకటిన పోర్ట్ స్టేడియంలో 7వ కాడెట్, క్యోరుగి, పూమ్ సే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలు జరుగుతాయని,ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పల్లం మురళీకృష్ణ తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రం నుండి 30 మంది క్రీడాకారులు ఎంపికకాగా, ఆ టీమ్‌లో చోడవరం విద్యార్థులు ముగ్గురు ఉన్నారన్నారు. కార్యక్రమంలో దండా గోవింద్, చవల చంద్ర శేఖర్ , కోచ్‌లు కొల్లిపార ప్రదీప్ కుమార్, సింహాచలం, సంతోష్ లక్ష్మి, జోడా ఆంజి,దండా నాగరాజు, నోకియా ప్రసాద్ పాల్గొన్నారు.

## బోరు బావి ఆక్రమణ తొలగింపు

### 'ప్రజాశక్తి' కథనానికి స్పందించిన మున్సిపాలిటీ



ఆక్రమణ తొలగించడానికి ముందు...తొలగించిన తర్వాత...

**ప్రజాశక్తి - యలమంచిలి :** పట్టణంలోని శేషుకొండ కాలనీలో ప్రభుత్వం తవ్విన బోరుబావిని ఆక్రమించి ప్రహరీలో కలుపుకున్న ఉదంతాన్ని ప్రజాశక్తి శనివారం సంచికలో 'శేషుకొండ కాలనీలో బోరుబావి కబ్జాపై ఫిర్యాదు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దానికి స్పందించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్, టిపిఒ, సిబ్బంది స్పందించి కబ్జా స్థలాన్ని పరిశీలించారు. బోరుబావి చుట్టూ కట్టిన ప్రహరీని ఆదివారం జెసిబితో తొలగించారు. బోరుబావికి కొత్త చప్టా కట్టించారు. అక్కడ ప్రజలకు అందుబాటులో ఉండేలా బోరుబావిని తయారుచేస్తామని స్థానికులకు హామీనిచ్చారు.

## ఆటో, మోటార్ కార్మికులకు నష్టం కలిగించే
# కొత్త చట్టాలను రద్దు చేయాలి : సిఐటియు

**ప్రజాశక్తి - కశింకోట :** ఆటో, మోటార్ కార్మికులకు నష్టం కలిగించే చట్టాన్ని రద్దు చేయాలని ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు శంకర్, జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నర్సింగబిల్లిలో ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో తమకు నష్టం కలిగించే చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు గుదిబండలా తయారుచేసిన కొత్త మోటార్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. చదువుకున్నా ఉద్యోగాలు రాక, కుటుంబపోషణకు ఆటోలను, మోటారు రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నామని, ఇపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చే కొత్తచట్టాలతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలోని రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, దీంతో గతుకుల రోడ్డుతో వాహనాల నిర్వహణ, మరమ్మతుల వ్యయం తీవ్రమైందని, ఇపుడు కొత్త చట్టాలతో మరిన్ని కష్టాలు ముంచుకురానున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీరో వడ్డీకి బ్యాంకు ద్వారా ప్రభుత్వాలు రుణాలు మంజూరు చేయాలని, 50ఏళ్లు దాటిన ప్రతి డ్రైవర్‌కూ ఉచిత వైద్యం, పెన్షన్ సౌకర్యాలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్, టాక్సు, చలానాలు, స్పేర్ పార్ట్స్ ధరలు, ఆర్‌టిఒ, పోలీస్ కేసులు వేధింపులు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు ఎంవిఎస్ అప్పారావు, రాజు, ఎం.రవి పాల్గొన్నారు



సిఐటియు ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

## పాతికేళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక



పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

**ప్రజాశక్తి -వడ్డాది :** వారంతా కలిసి చదువుకున్నారు.25 ఏళ్ల తర్వాత మళ్లీ తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో మళ్లీ కలుసుకున్నారు.ఇందుకు వడ్డాది జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల వేదికైంది. ఇక్కడ 1998-99 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వపు విద్యార్థులందరూ ఆదివారం కలుసుకున్నారు..చదువులు పూర్తయ్యాక ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుదూర ప్రాంతాల నుంచి వడ్డాది చేరుకున్నారు. పదోతరగతిలో 200 మంది విద్యార్థులు ఉండగా వీరిలో దాదాపు సగంమంది సమావేశానికి వచ్చి, పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.హోదాలు పక్కన పెట్టి, పెద్దవాళ్లమన్న సంగతిని మరిచి పోయి ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన కొంతమంది మాస్టార్లను ఘనంగా సన్మానించారు.భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహకరించాలని తీర్మానించుకున్నారు. దొండా నరేష్, రమేషు, తమన్నదొర, పాచిల నాగేష్, నాయుడు పాల్గొన్నారు.

## ఘనంగా మందపాటి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** పట్టణంలో రింగురోడ్డులోని వైసిపి కార్యాలయంలో ఆదివారం పట్టణ పార్టీ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌తో పాటు పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని జానకిరామరాజును పూలదండలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపిఐడబ్ల్యుసి మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, 83వ వార్డు ఇన్‌ఛార్జి జాజుల రమేష్, బొడ్డేడ శివ, మలసాల కుమార్ రాజా, మధు, శోభ, పలక సత్యనారాయణ, రమేష్ గుప్త పాల్గొన్నారు.



జానకిరామరాజుకు కేక్ తినిపిస్తున్న భరత్, ఇతర నేతలు

# యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం



అభినందన సభలో మాట్లాడుతున్న ఎంపీ సిఎం రమేష్

**ప్రజాశక్తి-కె.కోటపాడు:** ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు.ఆదివారం మండల కేంద్రం కె.కోటపాడులో కూటమి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వానికి కొత్త పరిశ్రమలు తీసుకురావడం చేతకాలేదని, సరికదా ఉన్న పరిశ్రమలు రాష్ట్రం నుండి వెళ్లగొట్టారన్నారు. పరిశ్రమలు లేకపోవడంతో ఎంతో మంది యువత ఉద్యోగ ఉపాధి లేక ఇబ్బందులు పడ్డారన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానన్నారు. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి తన శక్తి మేర కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జిల్లాలోనే మాడుగుల నియోజకవర్గం ఎంతో వెనుకబడి ఉందని, ఎటువంటి ఆర్థిక వనరులు లేవన్నారు. పెనుగొడు నుండి దేవరపల్లి వరకు నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేయాలని ఎంపీని కోరారు. వ్యవసాయధారిత పరిశ్రమల నెలకొల్పి ఇక్కడున్న యువతకు ఉపాధి కల్పించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, పివిజికుమార్ ముత్యాల నాయుడు రొంగలి మహేష్, కూటమి నేతలు బాలిభోయిన సంతోష్, కోటాన ఈశ్వరరావు, చల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడారు అంతకుముందు చౌడువాడ నుండి తొమ్మిది కిలోమీటర్ల మేర కూటమి శ్రేణులు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిలను భారీ ఊరేగింపుతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

## 11న వినియోగదారుల పరిష్కార వేదిక

**ప్రజాశక్తి- సబ్బవరం:** ఈ నెల11న సబ్బవరం గురువారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ వేదికలో పాల్గొని, తమ విద్యుత్ సమస్యలను ఫోరం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు.

# కలిగొట్ల యువత సేవాభావం.!

- సొంతనిధులు, శ్రమదానంతో శారద బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు
- ఆరేళ్లుగా ప్రజల అవస్థలను పట్టించుకోని అధికారుల తీరుపై విమర్శలు

**ప్రజాశక్తి-దేవరాపల్లి** : మండలంలోని కలిగొట్ల గ్రామం సమీపంలో శారదనదిపై వంతెన నిర్మించి ఆరేళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ ఇరువైపులా అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో మాడుగుల నియోజకవర్గ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటు నుంచి వైజాగ్ వెళ్లాలన్న, అటు మాడుగుల నుంచి రావాలన్నా అతి తక్కువ దూరం, ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది ఉండకపోవడంతో ఈ రహదారిలో మాడుగుల నియోజకవర్గంలోని మాడుగుల, చీడికాడ, కె. కోటపాడు, దేవరాపల్లి మండలాల్లోని పలుగ్రామాల్లో ప్రజలకు ఈ రహదారిలోనే ప్రధానంగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిలో ఎక్కువగా ప్రయాణికులు ప్రయాణించడం వలన కలిగొట్ల శారదానదిపై బ్రిడ్జి కోట్ల రూపాయాలతో నిర్మించినప్పటికీ ఈ బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కలిగొట్ల యువకులు ఇరువైపులా మట్టి వేసి, వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు.



శారద బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న యువత

అయితే ఇటీవల కురిసిన వర్షాలతో వేసిన మట్టి కొట్టుకుపోవడంతో వాహనదారుల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. మట్టికోతకు గురై, రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో పలు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలుబారిన పడిన సందర్భాలున్నాయి. ఇది గమనించిన కలిగొట్ల యువకులు ఆదివారం మరోసారి రూ.15 వేలు సొంత నిధులతో క్రషర్ మట్టి వేసి శ్రమదానంతో అప్రోచ్‌రోడ్డు బాగుచేసే చర్యలు చేపట్టారు..గత ప్రభుత్వంలోనైనా ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చింది కనుక ఇప్పటికైనా ఈ బ్రిడ్జికి ఇరువైపులా రహదారి పూర్తి చేసి, ప్రయాణకష్టాలకు విముక్తి కల్పించాలని ప్రజలు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు.

## 'గురువు' పదంలో తెలియని శక్తి ఉంది

### రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత



మంత్రి అనితకు వినతిపత్రం ఇస్తున్న1998 ఎంటిఎస్ టీచర్లు

**ప్రజాశక్తి-అనకాపల్లి** : గురువు అనే అనే పదంలోనే తెలియని శక్తి ఇమిడి ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.ఆదివారం స్థానిక సత్యాస్ లక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో పిఆర్‌టియు అధ్వర్యంలో ప్రతిభకు పట్టాభిషేకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా గడచిన ఐదేళ్లలో వైసిపి పాలనలో ఉపాధ్యాయులు ఎన్నో అవమానాలు, ఇబ్బందులకు గురయ్యారని, చంద్రబాబు ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అనితను సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు, పిఆర్‌టియు ప్రతినిధులు పాల్గొన్నారు.

**1998 ఎంటిఎస్ ఉపాధ్యాయుల వినతి**

1998 ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం హోంమంత్రి వంగలపూడి అనితకు వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఈ సమస్య ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని, విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణని కలిసి వినతిపత్రం అందిచారు. ఉపాధ్యాయులు వెంకునాయుడు, గణేష్, అప్పారావు, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, సుదర్శన్ పాల్గొన్నారు.

## భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

**ప్రజాశక్తి- అనకాపల్లి** : స్థానిక వేల్పుల వీధి దత్త మందిరంలో జైగీతా భగవద్గీతా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత విశ్వరూప సందర్శనం శ్లోకాలపై కంఠస్థ పోటీలు నిర్వహించారు. భగవద్గీత శిక్షణాచార్యులు, సాహితీ వేత్త కడిమిశెట్టి శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన ఈ పోటీల్లో సుమారు 50 మంది బాలలు, 30 మంది పెద్దలు పాల్గొన్నారు. పోటీల పర్యవేక్షకులుగా సంస్కత ఉపాధ్యాయులు యివటూరి వెంకట కూర్మనాధం వ్యవహరించారు. పోటీల కన్వీనర్ మైడూరి రామకష్ణ అన్నారు. గోగుల ఓం ప్రసాద్, విల్లూరి జై శ్రీమాన్, కొడమంచిలి జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం వేల్పుల వీధి దత్త మందిరంలో నిర్వహిస్తున్న ఉచిత భగవద్గీత శిక్షణా తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి జస్మిత ,ద్వితీయ ఇందు, తృతీయ బహుమతిని నవ్య గెలుచుకోగా మూడు విభాగాల్లో 9 బహుమతులనుఅందజేశారు. న్యాయ నిర్ణేతలుగా జయకృష్ణమూర్తి, కేంద్రీయ విద్యాలయం విశ్రాంత అధ్యాపకులు కల్లేపల్లి సుబ్బారావులు వ్యవహరించగా శ్రీకాళహస్తీశ్వర, వి లక్ష్మీతాయారు, వి.లక్ష్మి, వరలక్ష్మి, వి.నారీమణి పాల్గొన్నారు.

## ముమ్మరంగా వరి నారు పోతలు

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట** : మండలంలోని రాజాం పరిసర గ్రామాల్లో రెండు రోజులుగా వరి ఆకుమడులలో విత్తనాలను ముమ్మరంగా వేసే పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు.. మూడు రోజులుగా వాతావరణం చల్లగా ఉండడంతో పాటు, వరి విత్తనాలు వేసేందుకు అదును చిక్కడంతో పలువురు రైతులు వరి విత్తనాలను వేస్తున్నారు. వరి విత్తనాలు పైభాగాన కనబడకుండా చేస్తున్నారు.

## బాలిక హత్య కేసులో నిందితుడిని శిక్షించాలి : ఎస్‌ఎఫ్ఐ

**ప్రజాశక్తి - యలమంచిలి** : జిల్లాలోని రాంబిల్లి మండలం కొప్పుకొండపాలెంలో 9వ తరగతి విద్యార్థిని బద్ది దర్శినిని కిరాతకంగా హతమార్చిన సురేష్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలంటూ యలమంచిలి ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా సహాయకార్యదర్శి ఎం బాలాజీ డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఉచిత వైద్యశిబిరానికి స్పందన

**ప్రజాశక్తి-అనకాపల్లి** : అనకాపల్లి వాకర్స్ క్లబ్, ఉషా ప్రైమ్ హాస్పిటల్ సంయుక్తంగా ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డులో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. రక్తపోటు మధుమేహం వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులు ఇచ్చారు. సుమారుగా 110 మందిని పరీక్షించారు.కార్యక్రమంలో డాక్టర్ బి. శ్రీనివాసరావు, డాక్టర్ రాజేష్ మార్కెటింగ్ మేనేజర్‌తోపాటు వాకర్స్ భీశెట్టి రామకృష్ణ, అధ్యక్షులు, వై. సాంబశివరావు(శివ) కార్యదర్శి, రాపేటి నారాయణరావు, కోశాధికారి డాక్టర్ డిడి నాయుడు, డాక్టర్ కె వీరభద్రరావు, బీవీ రమణ, బుద్ధ అప్పారావు, టీఎస్ అప్పారావు, ఎంటి. రామారావు, దాడి అప్పలనాయుడు, ఆడారి రామకష్ణ, కొమ్మోజు రామకష్ణ, పి. అరుణాచలం, కృష్ణమూర్తి, ఎస్ జగ్గారావు, కాండ్రేగుల సాంబశివరావు, ఎస్ సన్యాసిరావు, వై సత్యనారాయణ పాల్గొన్నారు.

## కంటి ఆపరేషన్లకు 25మంది ఎంపిక

**ప్రజాశక్తి- కె. కోటపాడు** : మండలంలోని ఏ కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలోఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.. ఈ శిబిరం లో 60 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా, 25 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కంటి నరాలు చికిత్స కోసం ఇద్దరిని, కంటి పైపొర చికిత్స కోసం ఇద్దరిని, కంటి నీటి కాసుల చికిత్సకు ఒకరిని, కంటి రెప్పల చికిత్సకు ఇద్దరిని, చిన్నపిల్లల కంటి చికిత్సకు ఇద్దరు చిన్నారులను గుర్తించి, వారిని విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో చికిత్సకు రిఫర్ చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు అక్కున్నాయుడు శంకర్ ఫౌండేషన్ ఆప్తాల్మిక్ అధికారి హరి చందన,క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్ అశ్వనికుమార్ నర్సింగ్ స్టాఫ్ వందన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

**ప్రజాశక్తి- మునగపాక:** ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలో కూటమి గెలుపు విజయోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా సభలో విజయ్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్లపాటు తనతో పాటుగా పనిచేసే కూటమి శ్రేణులకు కష్టానికి తగిన ఫలితం కూటమి విజయంతో దక్కిందన్నారు. నమ్మి గెలిపించిన కూటమి కేడర్, ప్రజలకు న్యాయం చేస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి వారి రుణం తీర్చుకుంటానని ఉద్వేగంగా అన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మండల టిడిపి, జనసేన అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, బిజెపి నాయకులు బద్దం సూర్యనారాయణ, టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, భీమరసెట్టి శ్రీనివాసరావు, పెంటకోట విజయ్, డొక్కా నాగభూషణం, ఆడారి లక్ష్మణరావు, దాడి అప్పలనాయుడు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

## పారిశుధ్య పనులకు అదనపు ట్రాక్టర్

**ప్రజాశక్తి-.అనకాపల్లి** : తుమ్మపాల గ్రామ పంచాయతీలో గ్రామ విస్తీర్ణం పెరగడం, పారిశుద్ధ కార్మికుల సంఖ్య తగ్గడంతో నానాటికి పారిశుధ్య సమస్య తీవ్రతరమైంది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రస్తుత పాలకవర్గ సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, ఈవో ప్రత్యేక దృష్టి సారించి పాత ట్రాక్టర్లతో పాటు మరో ట్రాక్టర్‌ను ప్రస్తుత పాలకవర్గం అందుబాటులోకి తెచ్చింది. ఈ ట్రాక్టర్లు ఆదివారం సర్పంచ్ పెంటయ్య నాయుడు, ఇఒ ఈశ్వరరావు, ఎంపిటిసి, పంచాయితీ మెంబర్లు ప్రారంభించారు.

## నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి

**ప్రజాశక్తి- అనకాపల్లి** :ఈ నెల ఒకటి నుంచి అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ న్యాయ సురక్ష సంహిత భారతీయ సాక్ష్య చట్టాలను అమలుపరిచే ముందు వీటిపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధు కోరారు. కొత్త చట్టాలపై న్యాయ, పోలీసు వ్యవస్థలకు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేదన్నారు ఏళ్ల తరబడి అమల్లో ఉన్న పూర్వపు చట్టాలపైనే ప్రజల్లో పూర్తి అవగాహన లేదని, ఇపుడు ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కొత్త చట్టాలను తీసుకువచ్చారన్నారు. వీటన్నిటిపై అన్నివర్గాల ప్రజల్లో జిల్లా మెజిస్ట్రేట్, ఎస్‌పి ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## పాల సొసైటీ అధ్యక్షునిగా రమణబాబు



రమణబాబును సత్కరిస్తున్న సర్పంచ్, పాడిరైతులు

**ప్రజాశక్తి-సబ్బవరం** : మండలంలోని అమృతపురం విశాఖ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షునిగా గండి రమణబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రమణ బాబును మాజీ ఎంపిటిసి, సర్పంచ్ గండి ముత్యాల నాయుడు, పాడి రైతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణబాబు మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.పాల సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గొట్టివాడ సన్యాసిరావు, పలువురు డైరెక్టర్లు, పాడిరైతులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక దినోత్సవం

**ప్రజాశక్తి-సబ్బవరం** : పెందుర్తి నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ ఇండుగుబిల్లి గోపి అధ్యక్షతన మండల అధ్యక్షులు బొర్రా జయరాజు మాదిగ ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. సాయినగర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహం నుండి సబ్బవరం మూడు రోడ్లు జంక్షన్ వరకు మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహించారు. మందకృష్ణ మాదిగ 59వ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి ఎంఆర్‌పిఎస్ జెండాను ఆవిష్కరించారు. 30ఏళ్ల ఉద్యమంలో భాగస్వాములైన సీనియర్లను సత్కరించారు. అనకాపల్లి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గొటివాడ సామ్రాట్ కుమార్ మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు నీటిపల్లి ముత్యాలరావు, దువ్వ దుర్గాలు, గొటివాడ సన్యాసి, ఇండుగుబిల్లి పరదేశి, కొమ్ము కోటి అప్పారావు, నీటిపల్లి గంగరాజు, శాంతి కుమారి, నిమిడితల్లి చిన్నారావు, కోరుబిల్లి మారాజు, మారేడుబూడి కోటి, వంగలపూడి సంతోష్‌బాబు, గెడ్డం మహేష్, పలువురు డప్పు కళాకారులు పాల్గొన్నారు.

**విశాఖ కలెక్టరేట్** : ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఆ సంస్థ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు, ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, రాష్ట ఉపాధ్యక్షులు తొత్తరపూడి శ్రీనివాస్, కో-కన్వీనర్ అంజు దీపక్, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు పాల్గొన్నారు.

**చీడికాడ:** ఎస్‌సిల ఎబిసిడి వర్గీకరణ చట్టబద్ధతకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొర్తా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌సి కాలనీలో మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షులు రావాడ దేముడు బాబు ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ ఆర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. మాదిగ కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో.ఎంపిటిసి రావడ మని, పెదపూడి సూర్యం, రావాడ నాగమ్మ, రావాడ కన్నమ్మ, విశ్వేశ్వరమ్మ, కేశమ్మ, కొండమ్మ పాల్గొన్నారు

## ఇసుక రవాణాతో.. ఆనకట్టకు పొంచివున్న ప్రమాదం

**ప్రజాశక్తి - చీడికాడ:** మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తుండటంతో ఆయకట్టు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఇటీవల కాలంలో నాటుబళ్ళ ద్వారా ఇసుకను తరలించి విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. చీడికాడ మండలం ఎల్ ఎన్ పురం సమీపంలో మరల గుమ్మి ఆనకట్టుకు ఆనుకొని ఇసుకను తీస్తున్నారు. దీంతో, కోతకు గురై ఆనకట్ట శిథిలావస్థకు చేరే అవకాశాలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇలా ఇసుక తీయడంతో కోతకు గురై ఆనకట్ట ఒక వైపు కొట్టుకు పోయింది. దీంతో, సుమారు రెండేళ్లు కొన్ని గ్రామాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందలేదు. ఆ ప్రాంత రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగగా ఎట్టకేలకు స్పందించి గత ఏడాది కొట్టుకు పోయిన ఆనకట్టను పునర్నిర్మించారు. మరలా అదే చోట ఇసుక తీస్తుండటంతో ఆనకట్టు కొట్టుకు పోతుందని, దీంతో, తమకు సాగునీరు అందదని ఆనకట్ట దిగువ సాగుభూమి గల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆనకట్టుకు సమీపాన ఇసుక తీయకుండా చర్యలు తీసుకోవాల పలువురు రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు



ఆనకట్ట వద్ద ఇసుకను తరలిస్తున్న వ్యాపారులు





చదువుతున్న విద్యార్థులు

### గ్రంథాలయంలో 'చదవడం మా కిష్టం'

**ప్రజాశక్తి-గొలుగొండ:** ప్రతి ఒక్కరూ గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వహణ అధికారి రాజబాబు తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణతో విద్యార్థులకు కలిగే ఉపయోగాలను వివరించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటుగా, నిరుద్యోగులకు పోటీ పరీక్షలు అవసరమైన పుస్తకాలు కూడా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రోడ్డుపై రిక్షా బండిపై కూర్చున్న విద్యార్థులు

### బస్సుల కోసం రోడ్డుపై పడిగాపులు

**- ఆక్రమణకు గురైన బస్‌స్టాప్**

**ప్రజాశక్తి కోటవురట్ల:** మండల కేంద్రం లో ప్రధాన కూడలి వద్ద ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గతంలో బస్సు షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం అవి ఆక్రమణకు గురి కావడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు కోసం రోడ్లపై నిల్చుని ఎండనక వాననక ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు గ్రామస్తులు సైతం అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణకు గురైన బస్సు షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని కోరుకుంటున్నారు.

### నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలో కేడిపేట ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ సందర్భంగా ఈనెల 8న సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణారావు తెలిపారు. చిన్నయ్యపాలెం, కొత్త మల్లంపేట, అమ్మపేట, గింజర్తి, చోద్యం, లింగంపేట, రామచంద్రపురం తదితర గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

## అంగన్వాడీ కేంద్రానికి చీరతో ప్రహరీ..!

**ప్రజాశక్తి-కోటవురట్ల:** మండలంలోని వెంకటాపురం గ్రామంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ లేక పోవడంతో విద్యార్థులకు రక్షణగా చీరలతో ప్రహరీ ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కేంద్రం వద్ద పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో చిన్నారులకు రక్షణగా చీరలతో ప్రహరీ ఏర్పాటు చేశారు. సమీప ప్రాంతంలోనే బహిర్భూమికి పలువురు నిత్యం వెళ్తూ ఉండటంతో దుర్గంధం వెలువడుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడంతో పాటు పరిసర ప్రాంతాల పట్ల పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ కట్టిన చీర

## వైభవంగా జగన్నాథ రథయాత్ర

**ప్రజాశక్తి-అనకాపల్లి** : సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి రథయాత్రను ఆదివారం ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు. రథయాత్ర గవరపాలెం నుంచి పట్టణ పురవీధుల గుండా పయనించి గూడ్స్ రోడ్‌లోని ఇంద్రద్యుమ్న హాలుకు చేరుకుంటుంది.

గవరపాలెం అగ్రిమరిచెట్టు వద్ద కొలువైన జగన్నాథ స్వామి రథోత్సవంలో భాగంగా శనివారం రాత్రి ఆలయ మంటపంలో ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం జరిగింది. ఆదివారం ఉదయం రథంపై అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ సీఎం రమేష్ దంపతులు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దాడి రత్నాకర్‌లను ఆలయ అధికారులు స్వాగతించారు. డిఎస్‌పి అప్పలనాయుడు, పట్టణ సీఐ శంకరరావు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు కల్పించారు.కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఆలయం ఇఒ రాజా సులోచన, డైరెక్టర్లు రమేష్, అనకాపల్లి మోహనరావు, బోడ్డేడ వెంకట చలపతిరావు, కాండ్రేగుల వెంకట వీర అప్పారావు, బుగత కోటేశ్వరరావు, యల్లమల్లి ధనలక్ష్మి, బుద్ద లక్ష్మీ అప్పారావు, శరగడం కృష్ణ పాల్గొన్నారు.

**ఉక్కునగరం :** విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జగన్నాథ స్వామి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. విశాఖ ఉక్కు కర్మాగారం సిఎండి అతుల్ భట్ రథయాత్ర సందర్భంగా జగన్నాథుడిని రథంపైకి ఆహ్వానించారు. మహారాజు దుస్తులను ధరించి బంగారు చీపురుతో రథాన్ని ఊడ్చే "ఛెరపన్హార" కార్యక్రమాన్ని అతుల్ భట్ సంప్రదాయబద్ధంగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఉక్కునగరం వీధుల్లో రథాన్ని లాగారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

**ఎంవిపి.కాలనీ :** నగరంలో ఆదివారం ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యాన చేపట్టిన జగన్నాథుని రథయాత్ర ఘనంగా సాగింది. దసపల్లా హిల్స్‌లోని ఉత్కల్ సమాజ్ ప్రాంగణం, చిల్డ్రన్ ఎరీనా, మిలీనియం పెట్రోల్ బంక్, ఎయు అవుట్ గేట్, రైల్వే ఈస్ట్ పాయింట్ గెస్ట్ హౌస్, లాసన్స్ బే కాలనీ మీదుగా ఈ యాత్ర సాగింది. సమాజ్ అధ్యక్షుడు జెకె.నాయక్, ప్రధాన కార్యదర్శి బిమల్ కుమార్ మహంత పాల్గొన్నారు.

**విశాఖ కలెక్టరేట్ :** టౌన్ కొత్త రోడ్డులో ప్రసిద్ధి చెందిన శ్రీ జగన్నాథ స్వామి వారి తొలి రథయాత్ర నేత్రపర్వంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు జగన్నాథ స్వామిని దర్శించుకున్నారు. రథయాత్రను విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, దేవస్థానం ఫెస్టివల్ ఆఫీసర్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ ఎగ్జిక్యూట్ ఆఫీసర్ టి.రాజగోపాల్ రెడ్డి, ఎంబర్ మన్నార్ స్వామి ఆలయ ఇఒ నీలిమ, కరకచెట్టు పోలమాంబ ఆలయ ఇఒ కె.గాయత్రి, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకూటి నారాయణరావు, సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.





విశాఖలో రథయాత్రలో పాల్గొన్న భక్తులు

### ఆటో డ్రైవర్‌కు గాయాలు

**ప్రజాశక్తి- నక్కపల్లి :** మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ కే.దుర్గామల్లేష్ గాయపడ్డాడు. నక్కపల్లి నుంచి ఆటో డ్రైవర్ ఆటోలో తుని వెళుతుండగా ఉద్దండపురం వద్దకు వెళ్లే సరికి ముందు వెళ్తున్న కారు సడన్‌గా ఆగడంతో ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. స్థానిక సిహెచ్‌సిలో గాయపడ్డ మల్లేష్ కు చికిత్సను అందించారు

### గర్భిణికి తప్పని అవస్థలు

**కాలినడకన ఆసుపత్రికి..**

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:** మండలంలోని అతి మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బూసిపుట్టు పంచాయతీకి చెందిన ధోనిపుట్టు గ్రామానికి వైద్యం కోసం వెళ్లేందుకు అవస్థలు పడింది. గర్భిణీ పాంగి లక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో రహదారి సౌకర్యం లేక వాహనాలు గ్రామానికి రాలేదు. దీంతో, గ్రామం నుండి సంత వీది గ్రామం వరకు ఆశా వర్కర్, కుటుంబ సభ్యుల సహాయంతో ఆ గర్భిణీని కాలి నడకన సుమారు రెండు కిలోమీటర్లు దూరం తరలించారు. అక్కడి నుండి 108 వాహనంలో రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా సిబ్బంది లేక పోవడంతో ముంచింగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



కాలినడకన వెళ్తున్న గర్భిణి

# 10న డిమాండ్స్ డేను జయప్రదం చేయండి



విశాఖలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్


అనకాపల్లిలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం పచ్చి కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగించడాన్ని నిరసిస్తూ ఈ నెల 10న పని ప్రదేశాల్లో డిమాండ్స్ డే నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ కోరారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపికి ఈసారి సరైన మెజారిటీ లేదన్నారు. 2024 ఎన్నికల్లో ఆ పార్టీకి కార్మికులు గట్టి బుద్ధి చెప్పినప్పటికీ మోడీ మొండికేసి కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌ను ఎలాగైనా అమలు చేయాలని చూస్తున్నారన్నారు. పిఎఫ్ విధానంలో తీసుకొచ్చిన మార్పులు కార్మికులకు తీవ్ర నష్టం చేకూరుస్తాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపి, సొంత గనులు కేటాయించాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, ఎం.సుబ్బారావు, యు.రామస్వామి, యు.రాజు, పి.మణి, పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు. డిమాండ్స్ డే కరపత్రాన్ని ఆవిష్కరించారు.

**అనకాపల్లి** : ఈనెల 10నక్కోలే దినాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎం దుర్గారాణి అధ్యక్షతన జరిగింది. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా విస్తృత సమావేశంలో మాట్లాడుతూ 10న ప్రాజెక్టు, మండల కేంద్రాల్లో ధర్నాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమ్మె కాలంలో ఇచ్చిన హామీల జీవోలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కోత పెడుతుందని, అంగన్వాడీలకు నిధులు పెంచాలని, ఐదు సంవత్సరాల లోపు బాల బాలికలను ప్రైవేటు స్కూల్లో చేర్చుకుండా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని,రాజకీయ వేధింపులు ఆపాలని తదితర డిమాండ్లతో ధర్నాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగ శేషు, సంఘం నాయకులు కే.తనూజ, జిల్లా కోశాధికారి వివి రమణమ్మ,జయలక్ష్మి, రమణి, సత్యవేణి తదితరులు ఆధ్వర్యంలో 10 ప్రాజెక్టు నుండి అంగన్వాడి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లోకేష్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న యూనియన్ నేతలు

## లోకేష్‌ను కలిసిన గోపాల మిత్రలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: రాజధానిలో మంత్రి లోకేష్ నుకలిసి తమ బాధలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు రాష్ట్ర గోపాలమిత్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ తెలిపారు. నర్సీపట్నంలోని ఆయన నివాస గృహంలో విలేఖరులతో మాట్లాడుతూ, ఏళ్ల తరబడి పశుసంవర్ధక శాఖలో విధులు నిర్వహిస్తూ పాడి రైతులకు సేవలు అందిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం తమ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. గోపాల మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది పనిచేస్తున్నామని, 20 ఏళ్ల క్రితం చంద్రబాబు నాయుడు ఈ వ్యవస్థను స్థాపించారని, కక్షతోనే జగన్ ప్రభుత్వం వివక్ష చూపించిందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమను రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.


ప్రారంభ కార్యక్రమంలో మహిళలు

## విద్యార్థి టైలరింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:అల్లూరి విజ్ఞాన కేంద్రం సహకారంతో దక్షిణ నియోజకవర్గంలోని కొబ్బరి తోటలో విద్యార్థి టైలరింగ్ సెంటర్‌ను ఐద్వా జగదాంబ జోన్ నాయకులు కె.మణి, జి.వరలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ, కుటుంబ ఆర్థిక అవసరాలు రోజు రోజుకీ పెరుగుతున్న దృష్ట్యా ఇంటిలోనే ఉండి కుటుంబానికి ఆర్థిక సహకారం అందించడానికి కుట్టు మిషన్ దోహదపడుతుందన్నారు.ప్రతి రోజూ రెండు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సెంటర్ నిర్వాహకులు భారతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కొబ్బరితోట ప్రాంతం మహిళలు పాల్గొన్నారు.

### ఎయు ఉద్యోగుల

## జీతాలు, పెన్షన్లు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:ఆంధ్రాయూనివర్సిటీ ఉద్యోగులకు జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ చెల్లింపులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు), హాస్టల్ వర్కర్స్ యూనియన్ ఆంధ్ర యూనివర్సిటీ కమిటీలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు వి.కృష్ణారావు, అనపర్తి అప్పారావులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూలై నెల ప్రారంభమై ఎనిమిది రోజులవుతున్నా ఇంతవరకు బోధన, బోధనేతర ఉద్యోగులకు జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ చెల్లించలేదన్నారు. ఎయు వీసి రాజీనామాతో జీతాలు, పెన్షన్ చెల్లింపులు అవ్వకపోవడం ఉద్యోగులను, పెన్షనర్లను ఇబ్బంది పెట్టే చర్య ఇది అన్నారు.వీసి లేకపోయినా ఎయు పరిపాలన, కార్యకలాపాలు ఆటంకం లేకుండా సాగుతున్నప్పుడు ఉద్యోగుల జీతాల చెల్లింపుకు ఆటంకాలు ఎందుకని వారు ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ రోజువారీ మందులకు, ఇంటి అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకొని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి 10 వ తేదీలోపే ఉద్యోగుల జీతాలు, పెన్షన్ చెల్లించాలని కోరారు.లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

### వసతి గృహానికి డ్రైయినేజీ సౌకర్యం కల్పించాలని..

# ఐద్వా ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:28వ వార్డులో జనావాసాల మధ్యలో ఉన్న హాస్టల్‌కు డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని ఐద్వా నాయకులు కె.వి.సూర్యప్రభ, ఎల్.గౌరి మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం 28వ వార్డులోని నివాస ప్రాంతాల ప్రజలతో కలిసి పీనారిపాలెం జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లాడుతూ, హాస్టల్‌కు డ్రైనేజ్ సదుపాయం లేకపోవడంతో మురుగు నీరు రోడ్డపైకి రావడంతో నివాస ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని తెలిపారు. రోడ్డపై నీరు నిలువ ఉంటుందని, ఈ నీటిలో నుండి వార్డు ప్రజలు నడవడంతో అనేక రోగాలకు గురవుతు న్నారన్నారు. వారం రోజుల వ్యవధిలో సమస్య పరిష్కారం కాకపోతే ఐద్వా, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బీఎస్పీ పార్టీ నాయకుడు బొట్టా నాగరాజు మాట్లాడుతూ, నివాస ప్రాంతాలలో హాస్టల్ పెట్ట డానికి అధికారులు ఎలా పర్మిషన్ ఇస్తారని ప్రశ్నించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే హాస్టల్‌కు తాళం వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే త్రిమూర్తులు, విశ్రాంత మండలాధికారి ప్రేమాకర్, నివాస ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఐద్వా మహిళా నేతలు


సర్వే చేపడుతున్న వీఆర్‌ఓ

### కుల ధ్రువపత్రాల

## మంజూరుకు ముమ్మరంగా సర్వే

ప్రజాశక్తి- కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో కుల ధ్రువీకరణకై దరఖాస్తులు సుమోటోగా నమోదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది గత పక్షం రోజులుగా ధ్రువపత్రాల మంజూరుకై గ్రామాల బాట పట్టారు. ఇందులో భాగంగా ఆదివారం సెలవు దినం అయినప్పటికీ బోడపాలెం గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ అధికారి రామసాల పెద్దన్న దొర ఉదయాన్నే సర్వే నిమిత్తం గ్రామ బాట పట్టారు. విధి నిర్వహణ పట్ల అంకితభావంతో పని చేసే ఆయన పనితీరు పట్ల గ్రామస్తులు సహ పలువురు మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండల వ్యాప్తంగా సుమారు 4900 వరకు గతంలో ఎన్నడు ఎటువంటి ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్న వారిని ప్రభుత్వం సుమోటోగా గుర్తించింది. అయితే వారికి ధ్రువపత్రాలు అందించేందుకు సర్వే నిర్వహించి గ్రామంలో ఉన్నారా వలస బాట పట్టారా, లేక మృతి చెందారా అనే పలు విషయాల పట్ల సర్వే నిర్వహించి ధ్రువపత్రాలను అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. బోడపాలెం గ్రామానికి సంబంధించి 335 దరఖాస్తులను సర్వే చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాదు, గ్రామ సహాయకుడు రాజబాబు ఉన్నారు.

## విద్యార్థుల అభ్యున్నతికి కృషి : వంశీకృష్ణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: చదువుకు మించిన ఆస్తి లేదని, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తానని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉదయం శివాజీ పాలెం సవేరా ఫంక్షన్ హాల్లో కాటమ రాజు క్లబ్ 7 వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల్ని గొప్ప విద్యా వంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతీ తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం ఇటీవల 10 వ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయర్థం ఉత్తమ శ్రేణిలో పాసైన విద్యార్థులకు ఎంపిక చేసి నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేశారు. కాటమ రాజు క్లబ్ అధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు, క్లబ్ కార్యదర్శి రాజాన బంగారు రాజు, రవి చంద్ర, శ్యామ్ ప్రసాద్, వి. కేశవరావు, ఎస్ హరినాథ్, ఎల్వీ రమణ, కిషోర్ యాదవ్, కాయిత శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శత వసంతాల వేడుక నిర్వహణకు కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శత వసంతాల వేడుక నిర్వహణపై ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించి కమిటీని నియమించారు. అధ్యక్షులుగా గాడు అప్పల నాయుడు, గౌరవాధ్యక్షులుగా రిటైర్డ్ కమాండెంట్ కెఎస్ఎన్.మూర్తి, ప్రధాన కార్యదర్శిగా మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారిగా పూసర్ల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొండా బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశ్రాంత ఉపాధ్యాయులు అవనాపు అప్పలనాయుడు, టి.భీమారావు, పట్టణ ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు, మాజీ ఎన్టీవో సంఘం నాయకులు కె.ముత్యాలరావు, న్యాయవాదులు కోట మల్లికార్జునరావు, ఎంవి.పార్వతీశం తదితరులు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించిన అనంతరం, ఈ నెల 14న మరో సారి సమావేశం జరపాలని కమిటీ నిర్ణయించినట్లు ప్రతినిధులు తెలిపారు.